'అమ్మా! అమ్మా! వస్తున్నా!'

ఇప్పుడంటే ఎవ్వరికీ లెక్క లేకుండా పోయిందిగాని, ఒకప్పుడు టైలరు వీరాస్వామికున్న పేరు మా ఊళ్ళో మరెవ్వరికీ లేదు. అతనిది మొదట ఈ ఊరు కాకపోయినా, వచ్చిన ఆరు నెల్లలోనే ఊరంతా అతని పేరు వ్యాపించిపోయింది. ఊళ్లోకి ఏ కొత్త ఫాషను వచ్చినా అతని చేతి మీదుగా రావలసిందే. అసలు ఎవరయినా కొంచెం వింతగా ఉన్న చొక్కాగాని కోటుగాని తొడుక్కున్నా, అది వీరాస్వామి కుట్టినదంటే మరి మాట్లాడ్డానికి వీల్లేదు. శంఖంలో పోసిన తీర్థం. అతని టైలరింగు హోము మెయిను రోడ్డుమీదికి లేకపోతేనేం, ఫాషను పనివాడితనం కావలసిన వాళ్ళంతా అతని వద్దకే వస్తూండేవారు. అయితే అతనికి ఇంకొక కీర్తికూడా ఉండేది. పని ఒప్పుకున్నాడంటే అన్ననాటికి ఖచ్చితంగా చేసి ఇచ్చేశాడన్నమాటే. కాగ, కేవలం మిషన్‌మీద పనిచెయ్యడానికే తన దగ్గర నలుగురు పనివాళ్లు తప్ప, కత్తిరింపు యావత్తూ తను స్వయంగా చెయ్యవలసిందే. ఎవరయినా హితకాంక్షితులు "ఏమయ్యా వీరాస్వామీ ఇంతపని ఇలా నావల్ల కాదని వదలిపెట్టెయ్యకపోతే మరొక ఇద్దరు పనివాళ్ళను పెట్టుకుని, నువ్వు పైన అజమాయిషీ చెయ్యకూడదా? అసలు నువ్వింకా ఈ వీధి పట్టుకు కూర్చోవడమేమిటి? నువ్వే వస్తానంటే మెయిను రోడ్డులో స్థలమే దొరక్కపోతుందా?" అని అన్న సమయాల్లో "ఏదో బాబూ, ఇలా నడిచిపోతే చాలదా. ఆ పరమేశ్వరుడి కటాక్షం. ఒకళ్ళచేత పని చేయించి, వాళ్ళకి రావలసింది రాకుండా చేసిన పాతకం ఎందుకు బాబయ్యా! ఇప్పుడీ కుర్రాళ్లున్నారంటే వీళ్ళు పని నేర్చుకున్నాక, వాళ్లుంటామన్నా నేనుండనియ్యను. ఏదో ఓ మిషనుడొక్క సంపాదించిపెట్టి నీమాన నువ్వు బ్రతకరా బాబూ అని పంపించేస్తాను. ఇక నాకేమిటి బాబయ్యా! ఈ వీధిలో కాదు ఊరవతల ఉన్నా నేను చెయ్యగలిగినపాటి పని రాకపోదు. అంతకంటే మరి ఆశ లేదు. అంతా ఆ సర్వేశ్వరుడి కృప" అని ఒక తరహా వేదాంతిలా మాట్లాడేవాడు.

అటువంటి వీరస్వామికొట్టు ఎక్కడుందో ఇటీవలి వాళ్ళకి చాల మందికి తెలియదు. మొదటినుంచీ తెలిసినవాళ్ళయినా, ఇప్పుడు వీరస్వామి కొట్టంటే అదొకమాదిరిగా ఏమిటో తమకే తెలుసునన్నట్లుగా తల పంకించి పెదవివిరిచేవాళ్ళే. ఎంత అభిమానం ఉన్నవాళ్ళయితే మాత్రం ఇచ్చిన బట్టలు కుట్టకపోతేమానె, ఆరునెలల నాడయినా స్వస్వరూపంలో అయినా తిరిగి రాకుంటే ఎలా భరించగలరు? పూర్వం వీధి అరుగులమీద కుడితట్టున ఒక మెషీను, ఎడమవైపున రెండుమెషిన్లు ఫ్యాక్టరీచక్రాలకంటె నియామకంగా తిరుగుతూ ఉండేవి. కుడితట్టు మిగిలిన జాగాను అతను కత్తిరింపుబల్ల పెట్టుకొని కూర్చొనేవాడు. సమీపంలో కాజాలు కుట్టే కుర్రవాళ్ళు ఒకళ్ళిద్దరు ఉండేవారు. ఆ రోజుల్లో అతని కొట్టు ఆ వీధికి సినీమహాలువంటి అలంకారంగా ఉండేదన్నా వింతలేదు. అప్పుడు కొందరు, "ఏమోయి, నువ్వు ఒక పెద్ద బోర్డయినా కట్టవు" అంటే వీరస్వామి రాగవరుసని 'జగమెరిగిన బ్రాహ్మణునకు జందెం ఏలా' అనేవాడు. ఇంటి చూరు బల్లకు కొంచెం వెనుకగా వాసాలకు వేలగట్టిన ఐ. వీరస్వామి, టెయిలరు (ఇంగ్లీషులో) అన్న చిన్న నల్లటి బోర్డుతప్ప మరేవిధమయిన పటాపటోపమూ ఉండేది కాదు.

అప్పుడతను చెప్పినట్టే బోర్డు అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అందు మీది అక్షరాలు చాలా భాగం అస్పష్టంగా అయిపోయేయి. కాక వాటి ప్రయోజనమూ అట్టే లేదు. ఏమంటే అసలు మనిషంటూ ఇంటిదగ్గర ఉండి ఎప్పుడయినా పనిచేస్తేకదూ. ఎడమవైపు చిన్న కొట్టూ అరుగూ కలిసి ఇప్పుడొక కిళ్లీ సోడా దుకాణంగా పరిణమించాయి. వీరస్వామి ఇంటిదగ్గర ఉన్నా లేకపోయినా, అరుగుకి అలంకారార్థం అన్నట్లుగా ఒక మెషిన్‌మాత్రం కుడితట్టు కనిపిస్తూ ఉంటుంది. అంతే కాని, ఎవరూ బట్టలు కుట్టడం మాత్రం కనబడదు. అయితే అప్పుడప్పుడు సాయంకాలాలను, రాత్రి పదిగంటలవరకూ ఇంటిలోపలనుండి మెషీను శబ్దం వినిపిస్తూ ఉంటుంది. అటువంటి సమయాల్లో మాత్రం వీధిఅరుగుమీద మెషిన్ ఉండదు.

ఆ వేళ రాత్రి పదిగంటలు దాటిపోయింది. కాని, ఇంకా మెషీను శబ్దం వినిపిస్తూనే ఉంది. గదిలో ఒక పెద్ద పందిరిమంచం, రెండు చిన్న మంచాలూ, ఒక బట్టలుకుట్టే మెషిన్, బీరువా, ఒక టేబిలూ ప్రధానంగా ఉన్నాయి. గది ఒక మాదిరిగా విశాలమయినదే కాని, ఉన్న సామానుమూలాన మధ్యస్థలం అట్టే లేక కొంచెం ఇరుకుగా కనిపిస్తుంది. చిన్నమంచాలలో ఒకటి

కిటికీకి దగ్గరగా ఉంది. ఆ మంచంమీద తలగడ వేసుకొని, కిటికీకి ఆనుకొని ఉంది కాంతమ్మ. అసలే పాలిపోయిన మొగం, లోతుకు పోయిన కళ్ళు! ఆ మనిషి కిటికీలోంచి వచ్చిపడే వెన్నెల వెలుగులో మరీ బలహీనంగా కని పిస్తూంది.

కిటికీలోంచి అలా చంద్రబింబంవంక చూస్తూంటే ఎందుకో సన్నని చిరునవ్వు ఆమె పెదవుల మీద మెరిసింది. అంత లోతుకుపోయిన కళ్ళ లోనూ ఏదో చిత్రమయిన వెలుగువచ్చింది. అంతలో మెషినుశబ్దం ఆగి పోయింది. నిశ్శబ్దంగా ఉండేచోట హఠాత్తుగా శబ్దంఅయితే ఎలా గుంటుందో ఎడతెగకుండా అయ్యే శబ్దం ఆగిపోయినా అలాగే అనిపిస్తుంది. ఆమె దృష్టి చంద్రబింబం మీదనుండి మెషినుమీద పనిచేస్తున్న కుమార్తె రేవతి ముఖ బింబంమీదికి ప్రసరించింది. కాని, అట్టేసేపు నిలవలేదు. మళ్ళీ చంద్రబింబం వంకే దృష్టి తిరిగింది. కాని ఈ మారు పెదవులు చిరునవ్వులో వికసించలేదు. మీది పెదవి కొద్దిగా వంగింది. ముకుపుటాలు కొద్దిగా పెద్దదయేయి. కళ్ళల్లో ఇందాకటి వట్టి వెలుగుకాక, చంద్రబింబాన్ని స్పష్టంగా కనబడనీయని నీటి తెర ఏర్పడింది. అయితే ఈ పరిస్థితిని ఆమె సర్దుకొని, నవ్వూ ఏడుపూ రెండూ లేని, మామూలు మనిషి అవడానికి అట్టేసేపు పట్టలేదు. కాని, అంత లోనే ఎప్పటికంటే నిబ్బరంగా మెషీను శబ్దం కాసాగింది.

ఆమె మంచంమీద కొంచెం ముందుకు వంగి, "అమ్మాయి, రేవతమ్మా మరి పడుకోవూ, మొదటి ఆట సినిమా మనుష్యులు వెళ్ళిపోయి చాలా సేపయింది. గుమ్మంలో రాజమ్మ కొట్టుకూడా కట్టేసి వెళ్ళిపోయింది" అన్నది. అంత బలహీనమయిన మనిషికి అంత నిండయిన గొంతు ఉందని అనుకోడం కష్టమే. కూతురు ఏమీ మాట్లాడకుండా పనిచేసుకోడం చూసి, "అమ్మాయి, మరి పదిగంటలకల్లా పడుకొంటానన్నావు, ఇప్పుడు పదిన్నర దాటి ఉంటుందికదా, రేపు ఉదయం మళ్ళీ లేవడం కష్టం" అన్నది.

తన పని ఆపకుండానే రేవతి, "రేపు శనివారం అమ్మా. అయినా, ఇదిగో అయిపోయింది. ఎలాగూ ఆ రెండు చొక్కాలూ అయిపోయేయి కదా. ఇదొక్కటి ఉండిపోవడం ఎందుకని. ఇదయిపోగానే పడుకొంటాను. రేపు ఉదయం నువ్వు కత్తిరించి ఇచ్చేసేవంటే, ఆ జాకట్టూ గౌనులూ ఆదివారం సాయంకాలంలోపుని అయిపోతాయి"

"ఆఁ. ఎప్పుడో అయినప్పుడే అవుతాయి, నీ కెందుకమ్మా బాధ, నీ చదువో, నీ ఆటో పాటో మానుకోకుండాను."

"నా కిదే సరదాగా ఉందమ్మా, కాక, ఏం ఇక మరి కొన్నాళ్ళలో స్కూళ్ళలో అందరూ ఏదో ఒక వృత్తివిద్య నేర్చుకోవాలని పెడుతున్నారటమ్మా. కాదుగాని, అమ్మా, రేపు ఉదయం, ఆ జాకెట్లూ వాట్లో రోజులో ఒక్కొక్కటయినా నువ్వు నా చేత కత్తిరించాలి."

"అలాగేలే అమ్మా, మరిప్పుడు పడుకోకూడదా. రేపెలాగూ శెలవేకదా. ఆ మిగిలినది రేపు కుట్టకూడదా ?"

"అంతా అయిపోయిందమ్మా, ఒక్క జేబు వెయ్యడమే ఉంది. రేపు పొద్దున కీపని ఉండకూడదని"

"మంచిపట్టుదలే. పోనీ, ఆ కుట్టు ఏదో పూర్తిచేసి, కాజాలు కుట్టడం ఉదయానికి ఉంచెయ్యి."

"అలాగే ఉంచేస్తానుగాని, మరి నేను కుట్టుతూ ఉంటే, వింటూ పడుకొంటే నీకు నిద్రవస్తుందన్నావు ?"

"నిజమే, ఇందాకా చిన్నకునుకు పట్టింది కూడాను. కాని, ఆ సినీమా వాళ్ళు తిరిగివచ్చేటప్పుడు కొట్టే సోడాల కుంయ్, కుంయ్ చప్పుడుతో మెలుకువ వచ్చేసింది."

"అయిపోయిందమ్మా నా పని. పోనీ, ఇప్పుడేదయినా పుస్తకం చదువుదునా అమ్మా !"

"ఇంత రాత్రప్పుడేం చదువుతావులే"

"ఎంతయితే నేమమ్మా. రేపు ఉదయం ఎన్నిగంటలకు లేచినా బాధ లేదు. అమ్మా, అసలు రేపు వంటే ఆలస్యంగా చేసుకొందాము. ఒకవేళ వంటయిపోయినా నేనూ పన్నెండుగంటలదాకా తినను. నాన్న రోజూ పన్నెండుగంటలకికదూ ఇంటికి వస్తున్నారు. నేను రేపు నాన్న వచ్చేదాకా ఉంటాను."

"అలాగేలే అమ్మా, రేపటిగురించి ఇప్పుడాలోచన ఎందుకు ?"

"అందరూ ఎన్నో నెలలూ సంవత్సరాలగురించో ఆలోచిస్తారుకదా. అటువంటిది రేపటిగురించి ఆలోచించకూడదా ? అయితే, మరేమిటి, తెలుగు పద్యాలు చదవమన్నావా ? కథలు చదవమన్నావా ?"

"పద్యాలెందుకులే శ్రమ. కథలే మెల్లిగా చదువుకో. నీకూ నాకూ ఇద్దరికీ నిద్రవస్తుంది" అన్నది.

కాంతమ్మ ఉద్దేశం సరిఅయినదే. చదవడం మొదలుపెట్టిన పదినిమిషాల్లో రేవతి చదవడంలో తడబాటు పడడం, చదివిన వాక్యమే మళ్ళీమళ్ళీ చదువుతూ ఆగిపోతూ ఉండడం జరిగింది.

కాంతమ్మ మంచం దిగివెళ్ళి, నెమ్మదిగా పుస్తకం తీసుకొని, "పడుకో అమ్మా, చాలా రాత్రి అయింది" అన్నది. ఆమాట సరిగా తెలియనేలేదు రేవతికి. కాంతమ్మ దీపం తగ్గించి, దానిని యథాస్థానాన మిషినుదగ్గరగా పెట్టివచ్చి కిటికీలోకి అందనంత ఎత్తుగా వెళ్ళిపోయేడు. అక్కడయినా మబ్బులు కమ్మినట్లున్నాయి, వెన్నెల ఏమీ కాంతవంతముగా లేదు. ఇందాకా చందమామ ఉన్నప్పుడు సరిగా కనబడని ఒకటిరెండు నక్షత్రాలు ఇప్పుడు స్పష్టంగా మినుకు మినుకు మంటున్నాయి. కొంచెం సేపు అలా చూచేసరికి తలనొప్పి వచ్చినట్లయింది.

లేచివెళ్ళి దీపం తెచ్చి కిటికీలో పెట్టి, అమ్మాయి ఇందాకా చదివిన పుస్తకం తెచ్చుకొంది. కాని, తీరా తెచ్చుకున్నాక చదవాలనిపించలేదు. పాపం, అమ్మాయి యింతరాత్రివరకూ కుడుతూనే వుంది. ఇక రేపొద్దున దానికోసమే కదా విడిచిపెట్టాలి. ఇప్పుడు ఎలాగూ నిద్రపట్టేది లేదు. ఆ కాజాలు కుట్టేస్తే కాలక్షేపంగానయినా ఉంటుందనుకొని, వెళ్ళి అమ్మాయి కుట్టిన చొక్కాలు తెచ్చి మంచంమీద పెట్టుకొని, కాజాలు ఒక్కొక్కటే కుట్టసాగింది. అలా కొంచెం కుడుతూ ఉండేసరికల్లా ఏదో ఆలోచన వచ్చేది కాబోలు, కొంతసేపు ఆగిపోతూఉండేది. కాని, ఇందాకా ఊరికే నక్షత్రాల వంక చూస్తూఉంటే వచ్చిన తలనొప్పి మాత్రం ఏమీలేదు. న్యాయంగా తను పదినిమిషాల్లో చెయ్యవలసిన పనే కాని గంటపైగా అయినా కాంతమ్మకు విసుగు కలగలేదు. తను కాలక్షేపమేకదా ఈ పనిచేస్తున్నది.......సుమారు పన్నెండున్నర అవుతూ ఉండగా నిద్రవచ్చినట్లయింది. అయినా చేతిలో ఉన్న ఒక్కటీ పూర్తిచెయ్యాలనుకొంది. కాని అది పూర్తి కావడమే కనబడలేదు. అలా చిన్న కునుకు వస్తూంది, పోతోంది.

అంతలో వీధితలుపు చప్పుడయింది. ఆ చప్పుడామెకు హృద్గతమయినది. మొదటి మారు చప్పుడుతోనే ఆమె నిద్ర అంతర్ధానమయింది. కాని, ఆమె

లేచివెళ్ళి తీసేలోపునే, వరసగా అదేధోరణిని చప్పుడు ఎడతెరిపి లేకుండా కాసాగింది.

కాంతమ్మకు నిజంగా కోపమే వచ్చింది గాని, దానిని నవ్వులోకి మార్చుకొని, తలుపు తీస్తూ, "ఎందుకంతలా చప్పుడు చెయ్యడం, అమ్మాయి నిద్రపోతూంది. ఇరుగుపొరుగు వాళ్ళుకూడా నడిరాత్రి నిద్ర పాడ[illegible]టారు." అంది సస్మితంగా.

వీరాస్వామి ఏమీ సమాధానం చెప్పకుండా ఆమె మొగంలోకి తీక్షణంగా చూచి, ఛర్రున వెళ్ళి పెద్దమంచంమీద కూలపడ్డాడు.

కాంతమ్మ గడియ వేసుకొని, నెమ్మదిగా వచ్చి, "ఒక్కమారు లేస్తే దుప్పటి దులిపి పక్క పరుస్తాను" అన్నది.

వీరాస్వామి మంచంమీద అడ్డుగా గోడకు చేరగిలబడి, సగం కళ్ళు మూసుకొని, "అవును, ఇప్పటివరకూ కానిది, ఇప్పుడు తీరికయింది. పక్క వేస్తుందట పక్క చాలింది కాదేమిటి? హుఁ" అన్నాడు.

కాంతమ్మకు తెలుసును ఇటువంటి సందర్భంలో తానేమి మాట్లాడినా ధోరణి మరీ చెడుతుందనీ, అతను కోపం తెచ్చుకొని వీధిలోకి వెళ్ళిపోతాడనీ. అంచేత మాట్లాడకుండా వెళ్ళి తనమంచంమీద కూర్చుంది. ఇందాక కొంచెం వస్తున్నట్లనిపించిన నిద్ర మాయమయి పోయింది. పోనీ, మళ్ళీ కుడుతూఉంటే, నిద్ర వస్తుందేమోనని, ఇందాకా ఆగిపోయిన పనిని అందుకొంది.

ఇంకా ఆమె ఆరంభించి ఒక్కనిమిషమయినా అయిందో లేదో, ఉరిమినట్లుగా వీరాస్వామి గొంతు వినిపించింది. "ఏం, పగలూ రాత్రీ ఇదే పని చేస్తున్నానని నాకు చూపెట్టడానికా? నిద్రమానుకొని, ఇలాంటి తెలివితక్కువ వెధవపన్లు చేస్తేనే ఆ దగ్గు ఎక్కువవుతుంది" అన్నాడు.

"నిద్రపట్టకపోతేనే ఇలా కూర్చున్నాను. ఇంతసేపూ, పాపం, రేవతే నేను వద్దంటున్నా వినకుండా ఇది కుట్టింది. నాకు నిద్రాలేదు. అయినా ఉదయం మళ్ళీ అది చెయ్యవలసినదేకదా అని ఇలా చేస్తున్నాను."

"అంటే నీమాటేమిటి? నే నేపనీ చెయ్యకపోయినా నువ్వూ నీ కూతురూ ఇద్దరూ కలిసి, నన్ను పోషిస్తున్నారనే కదూ. నేను కష్టపడి చేసి తెచ్చినదంతా ఎవడికీ కనబడదు."

"మరి లేకపోతే మేం తెస్తున్నామా? తెస్తామా? ఏదో ఇంట్లో ఊరికే కూర్చోలేక ఊసుపోక చెయ్యడం గాని."

"ఊసుపోకపోతే మరోపనీ మరోపనీ లేదూ? ఇదొక్కటేనా? అసలు నా మెషీనూ బట్టలపెట్టి తియ్యవద్దని ఇదివర కెన్నిమార్లు చెప్పేను. ఇక నీఇష్టం. అవతల అరుగుమీద రాజమ్మ కిళ్లీదుకాణం ఉందికదూ. ఇవతలి అరుగుమీద కాంతమ్మ కిళ్లీదుకాణం, దానికూతురు మిషమకొట్టూను. ఎలాగూ చేస్తూ చేస్తూ దాన్లో దొంగతనం ఎందుకు?"

'మరి కొన్నాళ్ళకి' అని కాంతమ్మ ఏమో చెప్పబోయింది. కాని అంతలో దగ్గుతెర బలంగా వచ్చింది. ఎలాగో సర్దుకొంటూ పెరట్లోకి వెళ్ళింది. వీరాస్వామికి ఒక్కసారిగా కొత్తచైతన్యం వచ్చినట్టుంది. తానూలేచి పెరట్లోకి వెళ్ళాడు. అప్పటికింకా కాంతమ్మ దగ్గుతునేఉంది. అంతసేపు మసకమసకగా ఉండి అప్పుడే వెలుగెక్కిన ఉమ్మిలోని రక్తపు ఎరుపు మరీ భయంకరంగా కనిపించింది వీరాస్వామికి. నెమ్మదిగా ఆమెను పట్టుకొని, "అస్తమానం ఇంత మేర రావడం ఎందుకు? ఆ గదిలోనే ఇంత పొయ్యి బుగ్గివేసిన మూకుడు ఉంచుకొంటే, మంచిదని చెప్పాను కదూ" అన్నాడు.

సగం ఎగవూపిరితోనే, కాంతమ్మ, "నాకేం బాధలేదు. అమ్మాయి భయపడుతుంది. ఇక్కడయితే రెండు చెంబుల నీళ్లు పోస్తే అవతలికి కడుక్కుపోతుంది." అని చెంబు తండీలో ముంచుతుంటే, వీరాస్వామి చెంబు అందుకొని, తానే నీళ్ళుపోసి, ఆమెను నెమ్మదిగా తన వంటికి ఆనించుకొని, తీసుకొనివెళ్ళి మంచంమీద కూర్చోబెట్టి తాను పక్కనే కూర్చున్నాడు. కాంతమ్మ కొంచెం సర్దుకుని, "నిద్ర వస్తున్నది కాబోలు, పడుకోక్కూడదూ" అన్నది.

అతను "అలాగే, నా పడుకోడాని కేముంది? నువ్వు పడుకో" అని తాను మంచం చివరకు జరిగి, తన తొడమీద ఆమె తల ఉంచి, "ఇలా పడుకో మెల్లిగా జోకొడుదునా, అసలే వంట్లో బాగులేదు కదా, ఇంత రాత్రిదాకా నిద్ర మానుకుంటావా, ఇదంతా నా మీద కోపమేకదూ" అన్నాడు.

ఈ మంత్రంతో కాంతమ్మ తన కోపాన్నేకాదు, జబ్బునుకూడా మరిచిపోగలిగింది. పెళ్ళయిన కొత్తరోజుల్లో, తను బలంగా ఆరోగ్యంగా

న్నప్పుడు, తనకు కోపం వస్తే భర్త అనునయిస్తూంటే పొందిన అనుభూతి వంటి అనుభూతిని పొందగలిగింది ఆ మధురస్పర్శతో, ఆ మృదువాక్యాలతో.

అతను నిద్రపొమ్మన్నాడేగాని, ఆమె నిద్రపోవడం అతనికి ఇష్టమా? ఆమెకు మాత్రం అంతటి ఆనందసమయంలో నిద్రవస్తుందా? చాలాసేపు అతి అన్యోన్యంగా, ఇటీవల చిక్కుల కేమాత్రం జ్ఞప్తికి తెచ్చుకోకుండా, వెనకటి రోజులలోని మధురిమను స్మరించుకుంటూ, భవిష్యత్తులో చెయ్యవలసిన కార్యక్రమం గురించి కలలుకంటూ, గడిపేరు. కలలంటే కొన్ని మరీ అసంభవంగా కనిపించేవి కావు. రాజమ్మ కిళ్ళీదుకాణం ఎత్తిపెట్టించేయడం, ఇల్లు కొనుక్కున్నాయనకు బాకీపడిన రెండునెలల అద్దె చెల్లించేసి అవతలి గదిలో ఆయన పెట్టిన బస్తాలు తీయించెయ్యడం, అమ్మాయి చదువుకోవాలనుకున్నంత వరకూ ఎంతయినా సరే చదివించడం, మళ్ళీ కొద్దిరోజుల్లో పనిబాగా సాగడంతో, ఒక రెండువందలరూపాయలు పట్టుకొని వెళ్ళి పెద్ద డాక్టరుగారి చేతిలోపెట్టి, బాబూ, అప్పుడు నాకు అంత చచ్చినంత జబ్బుచేస్తే, మీరే దేవుడిలా బ్రతికించారు. ఇప్పుడు మీరే ఎట్లాగో మాట దక్కించుకోవాలనడం... ఇటువంటివే కలలు.

ఇద్దరికీ లోపల్లోపల ఇది మరి నయంఅయ్యే జబ్బుకాదేమో నన్న భయంవుంది. కాని ఒకరి సమక్షంలో ఇంకొకరికి ఆమాట అనడానికి ఇష్టం లేదు.

అతనింకా అలా మాట్లాడుతూ ఉండగానే ఆమెకు నిద్ర పట్టింది, తనకూ కొంచెం నిద్ర వస్తున్నట్టనిపించింది. మెల్లగా ఆమె తలను తలగడమీద ఉంచి తాను వెళ్ళి తన మంచంమీద పడుకున్నాడు.

తరవాత ఒక గంట లోపునే మళ్ళీ దగ్గువచ్చి లేచిన కాంతమ్మ తెల్లవారేవరకూ మేలుకునే ఉండడం అతనికి తెలియనే తెలియదు.

ఉదయం నిద్ర లేచిన వీరాస్వామి, తొలినాటి రాత్రి వీరాస్వామి కాడు. "వెధవది కాఫీనీళ్లు కూడా లేకపోతే, ఇక ఇల్లెందుకు దరిద్రం" అని విసుక్కో సాగాడు.

కాంతమ్మ "ఇదిగో ఎంత, అమ్మాయిని లేపి, ఎదురింటి రామన్న గారింటి దగ్గరనుండి తెప్పిస్తా"నంటూ ఉంటే, "ఎందుకూ? అక్కర్లేదు, నేనే పోయి తాగి వస్తాను. దాన్ని లేపకు. పడుకోనీ. ఏమయినా చిల్లర

డబ్బులుంటే ఇలా పారెయ్యి" అన్నాడు. అసలు నిజానికి వీరాస్వామికి కూతురు రేవతి దగ్గర ఒక రకం మొగమాటం ఏర్పడింది. ఇటీవల ఇంటికి తాను సరిగా రాకపోయిన దగ్గరనుంచీను, తాను వచ్చినా రాకపోయినా; స్కూలుకు వెళ్ళినప్పుడో రాత్రో నాన్న వస్తున్నారనీ, ఇప్పు డిప్పుడే మళ్ళీ వీధిలోకి వెళ్ళిపోయారనీ కాంతమ్మ కూతురితో అబద్ధాలు చెప్తున్నట్లు అతనికేం తెలుసును? తొందర తొందరగా వెళ్ళిపోయాడు కాఫీ క్లబ్బుకని. ఆ పోవడం అంతే,మళ్ళీ రెండు రోజులనాడు రాత్రి ఒంటిగంటకే రాక.

*   *   *   *   *

పెద్ద మంచమూ బీరువా టేబిలూ లేకపోవడంవల్ల ఆ గదే ఇప్పుడు వెనుకటికంటె విశాలంగా కనిపిస్తోంది. తల్లీ కూతుళ్ళిద్దరూ మాత్రం యథా స్థానాలలోనే ఉన్నారు. కూతురు మెషినుమీద కుట్టుతూ, తల్లి మంచం మీద కూర్చుని. అయితే అప్పటికంటె తల్లి మరీ బలహీనంగా తయారయింది. కూతురు పనిలో అప్పటికంటే ఎక్కువ నైపుణ్యం సంపాయించింది. అంతే కాదు, అప్పటిలాగ తల్లి కిటికీలోకి శూన్యదృక్కులతో చూస్తూ కూర్చోవ లేదు. అప్పటికంటే కూడా బలహీనమయిన వేళ్ళతోనే కాజాలు కుట్టడం, పోగు పొయ్యడం మొదలయిన పనులు చేస్తూంది.

రేవతి చేతిలోని పని అయిపోయాక ఇంకొకటి తీస్తూ "ఎందుకమ్మా నీకు శ్రమ. పడుకోకూడదా, పొద్దున్న పొరుగువాళ్ళ జానకి చేసేస్తుందికదా లేకపోతే నేనే చేసేస్తాను."

"బాగుందమ్మాయి నీ మాట. నిన్ను ఒక్కర్తెను ఇలా రాత్రంతా పని చెయ్యమని చెప్పి, నన్ను హాయిగా నిద్రపొమ్మన్నావా?"

"మరి నాకు నువ్వు హాయిగా నిద్రపోవడమే కావాలి."

"అందుకయినా ఇప్పుడేదో ఇలా కొంతపని చేస్తే తరవాత కొంత సేపయినా నిద్రపడుతుంది. అయినా నువ్వు నీ చదువుకూడా మానుకుని, రాత్రింబగళ్లు తిన్నగా తిండయినా తినకుండా, ఇంతపని చెయ్యడం ఏమీ బాగులేదమ్మాయి."

"ఒస్, ఎంతపనికీ ఏముంది. ఈ ఒక్క సెల్లాళ్లేకదా. తరవాత పండుగ వెళ్ళాక మనం చేస్తామన్నా అట్టే పనికిరాదు. కాని, అమ్మా ఒక్క సంగతి..."

"ఏమిటమ్మా ? చెప్పు."

"మరి చేస్తావా నేను చెప్పినట్లు ?"

"ఏమిటమ్మా ? చెప్పుదూ."

"ఏమీ లేదమ్మా, ఈ కుట్టుకూలి అంతా నాకే ఇచ్చెయ్యాలి. ఇందులో మరి నువ్వేమీ తీసుకోకూడదు, నేనేం చేసినాసరే అడగకూడదు. నాకు వేరే పనుంది."

"అలాగే కానీ అమ్మా."

"ఆఁ. అలాగే అంటావు. ఏదేదో ఖర్చుచేసేస్తావు. ఇప్పుడు నాకు ఈ ఉన్నబట్టలు చాలును. అయినా మరి స్కూలుకు వెళ్ళనుకదా. నువ్విప్పుడు నా దగ్గర అలాగే అంటావు. నాన్న వచ్చేసరికల్లా ఎక్కడెక్కడ మూలనున్నదీ తీసి ఇచ్చేస్తావు. మరి ఈ మారు ఇదేమీ ముట్టుకోడానికి వీల్లేదుసుమా. నేను అంతా బాగా లెక్కవేశాను. ఇప్పుడు చిన్నసందుగ పెట్టెలోఉన్న ఇరవై ఎనిమిదిరూపాయలూ, ఈ పండుగలోపున ఇప్పటికంటే ఎనిమిది ఎక్కువే ఉంటుందిగాని తక్కువ ఉండదుగదా. మన ఇంటి ఖర్చులుంపోను, అంతా రెండువందలరూపాయలవుతుంది. ఆ రెండువందలూ పెడితే..."

"ఒక చిన్న బంగారపు గొలుసు వస్తుంది నీకు"

"నాకు గొలుసెందుకమ్మా ! ఇంకా కావాలంటే ఈ చెవుల జుమ్కాలే అమ్మేద్దా మనుకొంటున్నాను. రెండువందలు పెడితే అక్కడి శానిటోరియంలో రెండునెల్లు నువ్వు ఉండవచ్చునట. పెద్ద డాక్టరుగారు చెప్పారు. తరవాత నెలనెలా వంద చొప్పున తెస్తాను."

"బాగుందమ్మా ! ఇదా నీ ఆలోచన? అందుకయితే నువ్వే కష్టపడకు. అక్కడికి వెళ్ళినందువల్ల ఏమీ లాభంలేదు. బాగా డబ్బున్నవాళ్ళు మరి కొద్ది రోజులు బతకడానికీ తాము బాధపడుతూ తక్కినవాళ్ళను బాధ పెట్టడానికిని."

"అదేమిటమ్మా నువ్వలా అంటావు. నేను పెద్ద డాక్టరుగారినే అడిగాను. ఆయన చెప్పేరు. మీ అమ్మకేం భయంలేదమ్మాయి అని. అయినా అక్కడికి వెళ్ళివుంటే వేగం బాగయిపోతుందన్నారు. అసలు ఇప్పటిలాగ అప్పుడు నేను కుట్టుపని మొదలుపెట్టిన దగ్గరనుండీ పనిచేసి వుంటేనా ? ఈపాటికి రెండువందలూ వచ్చిఉండును."

"ఇప్పుడుమాత్రం రాలేదేమిటి ? మరి ఇంటి ఖర్చంతా నీ సంపాదనే కదూ" అన్నది కాంతమ్మ. ఈ మాట అప్రయత్నంగా తననోటను రావడంతో కాంతమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగేయి. చేస్తున్న పని అలా పక్కన ఉంచి కిటికీ వైపు తిరిగింది. కాని రేవతికి మాత్రం ఆ మాటతో మరికొంత ఉత్సాహమే కలిగింది. ఏదో మనసులో పాడుకుంటూ కుట్టసాగింది.

మరి కొంత సేపటికి కాంతమ్మ సర్దుకుని మళ్ళీ పని ఆరంభించింది.

రేవతి చేతిలో పని అయిపోగానే, అప్పటికి కుట్టిన మూర్తులెన్నో, వాటికి రావలసిన మజూరీ ఎంతో లెక్క వేసుకుని అవి గుడ్డపీలికతో కట్టి, శ్యామలాంబగారి జాకట్లు తీసింది.

అంతసేపూ ఇంక పని ఎత్తిపెట్టేస్తుంది కాబోలని ఆమెను గమనిస్తూ ఉండిన కాంతమ్మ మరి ఊరుకోలేక, "పన్నెండు దగ్గర కావస్తూందికదా! మగ నువ్వు మేలుకున్నంతసేపూ నేనూ ఇలా కూర్చుంటాను. నీ ఇష్టం" అన్నది.

రేవతి సర్దుబాటుగా "ఏముందమ్మా, ఇవి రెండే జాకట్లుకదూ. రేపు దయం వాళ్ళబ్బాయి వచ్చేసరికి వాళ్ళంటివన్నీ ఇచ్చేస్తే—ఇంకా వాళ్ళ పిల్లలకి పంట్లాలూ కోట్లు కూడా కుట్టాలిట" అని కొంచెం ఆగి "కాని, అమ్మా ఆవేళ నువ్వు అంత పట్టుదలపట్టి మెషిన్ అమ్మేస్తే నువ్వూ నేనూ నూతిలో పడిపోతామని అంత గట్టిగా చెప్పబట్టిగాని, లేకపోతే ఈ పాటికి ఇది తక్కిన బీరువా, పందిరిమంచం, టేబిలు, కుర్చీలు, బిందెలు వీటితోపాటే అయిపోవును. ఈ డబ్బు కూడా పట్టుకెళ్ళి..." రేవతికి తన తండ్రి డబ్బు ఖర్చుపెట్టే విధానాలు చూచాయగా తెలియకపోలేదు. కాని, తనే అనడానికి ఇష్టపడలేదు. అమ్మ ఏమీ మాట్లాడకపోవడం చూసి, "ఎప్పుడూ అంత నెమ్మదిగా ఊరుకునేదానివి, ఆవేళ నీ కంత పట్టుదల ఎలా వచ్చిందో?" అన్నది.

"పట్టుదలా ? నీ కోసమేనమ్మా. అది లేకపోతే డబ్బుమాట దేముడెరుగును. నీ కసలే ఊసుపోదు. స్కూలుకు కూడా వెళ్ళడం మానేశావు. అయినా ఎలా వెళ్తావులే, ఒక నాలుగు జతల బట్టలయినా లేవుకదా."

"లేకేమమ్మా, ఉన్నాయి. ఇంకా ఆ పాతవి అక్కడక్కడ కొంచెం చిరిగినవి తీసి, ఎప్పుడయినా పని తక్కువగా ఉన్నప్పుడుగాని కుట్టేసుకుంటె

నాకు కావలసినన్ని ఉన్నాయి. పరికిణీలూ జాకెట్లూను. వోణీలు రెండూ ఇంకా కొత్తగానే ఉన్నాయి. నీకే, అసలు ఉన్నవే రెండు చీరలు. ఇదుగో ఈ పండుగ అయిపోనీ, అప్పుడు నిన్ను అక్కడికి దిగబెట్టేముందు కొనుక్కుందాము. అమ్మా ఆ శానిటోరియంలోకి నన్ను రానిస్తారా? అయినా మరి నా కిక్కడ పని ఉంటుందిగాని, ప్రతి ఆదివారం ప్రొద్దున్న బయలుదేరి వచ్చి సాయంకాలానికి తిరిగి వచ్చేస్తూ ఉంటాను. ఈ మెషీనంటూ ఉంటే చాలును. ఇదే మనని కాపాడుతుంది. నాన్నా, ఆవేళ ఎంతకి రెండువందలకా బేరం కుదుర్చుకుని వచ్చారు?"

"ఊఁహూఁ. పూర్తిగా రెండువందలూ లేదు. నూటతొంభైఏనటు."

"ఎంతయితేనేమి, రెండువందలు కాదు, మూడువందలైతే మాత్రం మరి మళ్ళీ మళ్ళీ రాదుకదా! ఆ డబ్బు ఖర్చయిపోవడంతో సరి. ఇందాకా నువ్వు చెప్పినట్టు ఇప్పటికే మనకు ఆ రెండువందలూ దీనిమీది వచ్చేశాయి. అది మనకింక ఉట్టినే ఉన్నట్టే. మా స్కూలులో పిల్ల సరస్వతి వీణ నేర్చుకుంటోంది. వీణ తీసినప్పుడల్లా దానికి దండం పెడుతుంది. అలాగే నాకూ ప్రొద్దున్నే లక్ష్మీదేవి పటానికీ, తులసమ్మకూ, నీకూ దండం పెట్టాక మెషీనుకు కూడా దండం పెట్టాలనిపిస్తుందమ్మా. ఏం తప్పా?"

"తప్పేమీ లేదుగాని, మెషీనుకేం ప్రాణం ఉందా!"

"అయితే మరి సరస్వతి వీణకు మాత్రం ప్రాణం ఉందేమిటి? కాకపోయినా, మనకు దేవుళ్ళుగాని, కాగితానికి చెట్టుకు మాత్రం మనకున్నలాటి ప్రాణం ఉందా?"

"ఏమోనమ్మా, నీతో నేను వాదించలేను. రైలుకూ, కారుకూ, సైకిలుకూ ఎవళ్ళూ దండం పెట్టడం, పూజ చెయ్యడం నాకు తెలియదు."

"లేదమ్మా, హాస్పటలుకు వెళ్లే దారిలో ఒక పెద్ద టెయిలరుషాపు ఉంది. అందులో ఆ మిషను ప్రక్కనే మన లక్ష్మీపటం లాంటిదే, ఇంతకంటే చిన్నదిగాని, ఒక పటం ఉంది. రోజూ ఆ పటానికి నమస్కారం చేసి; హారతికర్పూరం హారతిచ్చి అగరువత్తి ఎలిగించి పటానికి ఒకమూల తగిలించి, మెషినుకి దండం పెట్టిన తర్వాత అతనేపనీ ముట్టుకోడట. అందుకే అంత బాగా ఉంది అతనిపని. పెద్దవీధిలో బట్టలషాపులో సగంవాటా తీసుకుంటు

న్నాడట. ముసలివాడేగాని, అమ్మా ఎంత జోరుగా కత్తిరిస్తాడనుకున్నావు? అసలు కొత్తలు చూస్తున్నాడా అనిపిస్తుంది. మళ్ళీ అన్నీ ఒక అరంగుళమయినా అటూ ఇటూ కావుట. అతని దగ్గిర కుట్టించినది ఏదయినా సరిగా లేదంటే, మళ్లీ తనే స్వయంగా బట్ట కొని కుట్టి ఇస్తాడట. ఎప్పుడూ ముగ్గురు పనివాళ్ళు పనిచేస్తూనే ఉంటారు. అయినా పని ఎక్కువేనట. అక్కడ ఇచ్చిన బట్టలు నెల్లాళ్ళకో వచ్చినా వేగం వచ్చినట్టేనట. అయినా అతను చెయ్యలేక, కొంతపని వదులుకుంటున్నాడట. అప్పుడు నాన్న ఈ ఊరొచ్చిన కొత్తలోనూ అలాగే ఉండేది కాబోలు."

అంతసేపూ మాట్లాడకుండా వింటున్న కాంతమ్మకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. అదివరకు కొన్ని వందలసార్లు చెప్పుకున్నదే అయినా, ఆ మొదటిరోజుల కబుర్లు తల్లికూతుళ్ళిద్దరికీ నిత్యనూతనంగా ఉండేవి. అలా వింటూండగా రేవతి పని తనకు తెలియకుండానే ఆగిపోయింది.

విని విని రేవతి "అవునమ్మా. నాన్నకు ఆ ధర్మ గుణం ఇప్పటికీ పోలేదు. ఎవడయినా అడుక్కునేవాడు వస్తే, తన జేబులో ఉండాలిగాని, అణో బేడో పావలో ఎంతో వాడి అదృష్టం, ఇచ్చేశారన్నమాటే. కాక, తను ఇంటిదగ్గరున్నప్పుడు మనంగాని ముష్టివాడికి ఎవడికయినా బియ్యం నిండుకున్నాయన్నామంటే, దగ్గర ఏది కనబడితే అది, గిన్నో, ముంతో, గ్లాసో, లేక తన బనీనో ఏదో ఒకటి ఇచ్చి "పోయి అమ్ముకోరా" అంటారు. అయితే అమ్మా అప్పటి రోజుల్లో ఇంతేసి మజూరీ రేట్లు లేవుకదూ."

"ఇంతే నెక్కడమ్మా? అయితే ఆరోజుల్లో అన్నీ అంత చవకగానూ ఉండేవి."

"ఇప్పుడెంత రేట్లుంటే ఏంలాభం? మనకు బాగా పనిచేసే కుర్రాడొకడు, మరొక మెషినూ ఉంటే బాగుండును. ఈ ఒక్కదానిమీద ఏమాత్రం చెయ్యగలం. అప్పుడు నాలుగు మెషిన్లకూ నిండుగా పని ఉండేది కదూ?"

నాలుగేమిటమ్మా, చెప్తే వింతగా ఉంటుంది గాని, పధ్నాలుగింటికయినా సరిపడే పని వచ్చిందం లేనమ్మ. అప్పుడేగాని, పెద్దబజార్లోకి మార్చేసి ఆ రకంగా మరొక్క పదేళ్ళు చేసిఉంటే..."

"ఈ పాటికి మనకూ ఓ పెద్ద మేడ, బట్టలషాపు ఉండును. నీ జబ్బుకు మందుకుకూడా, ఇక్కడ కాకపోతే, మరెక్కడయినా సరే, ఎంత ఖర్చయినా సరే..."

తన మనసులో ఉన్నమాట అనకుండా ఉండలేక పోయింది కాంతమ్మ. "మీ నాన్న సరిగా పనిచేస్తూ మామూలుగా ఉంటూఉంటే, జబ్బింతవరకూ రాకనే పోనమ్మా" అన్నది. అనేసింది గాని, ఎందుకన్నానా అని తరవాత నొచ్చుకుంది.

"ఇప్పుడయినా, అమ్మా అక్కడికి వెళ్ళినా బాగుకాదంటావా ?"

తన సంగతి బాగానే తెలుస్తున్నా, "ఎందుకు బాగుకాదమ్మా, అసలు నువ్వు మొన్న హాస్పిటలునుండి తెచ్చిన మందుతో చాలా గుణం కనిపించింది. దగ్గువచ్చినా, ఊపిరి హాయిగా తీసుకోనిస్తోంది. గుండెల్లో తేలికగా ఉంది."

"ఇప్పుడు మరొక్క మోతాదు ఇస్తానుండమ్మా" అంటూ లేచింది రేవతి.

"ఇందాకా తాగానుకాని, పోనీ, తే, హాయిగా నిద్రపడుంది. మరి పడుకుంటావా ? పన్నెండు పూర్తయింది."

"అలాగేనమ్మా. ఇదిగో ఇంద, మరొక పది నిమిషాల్లో అయిపోతుంది. పడుకుంటే నాకేం నీలాగ కాదు, వెంటనే నిద్రపట్టిపోతుంది. మళ్లీ ఉదయం అయిదు గంటలకు గాని లేచేది లేదు."

"అయితే మరింకా పడుకోవా ? ఇంద గ్లాసు. ఆ కొంచెం పనీ ఉండిపోతేనేమి ? కావాలంటే తెల్లవారుజామున నాలుగు గంటలకు లేపుతాను."

"ఆఁ. అలాగే అంటావు. ఏడుగంటలదాకా నే లేపకపోయినా ఊరుకుంటావు. ఏమమ్మా అంటె నేనూ ఇప్పుడే లేచానంటావు."

"మరయితే నా మాట నమ్మకంలేదా అమ్మాయి ?"

"ఇప్పుడిప్పుడు అయిపోతున్నదానికి మరెందుకమ్మా. నువ్వే మునుపు చెప్పేదానివి నా చదువు గురించి. ఎప్పుడు చెయ్యవలసిన పని అప్పుడే వెంటనే చెయ్యడం మంచిదిగాని, వాయిదా వెయ్యకూడదని."

"అలాగని ఒక్కమారే ఎడతెరిపి లేకుండా చేస్తారా? మరి నేను పడుకుంటున్నాను. నీ ఇష్టం నువ్వెప్పుడు పడుకుంటావో" అని కళ్ళు మూసుకుని కిటికీతట్టు తిరిగి పండుకుంది కాంతమ్మ. నిజంగా అన్నట్లుగానే చేతిలో పని అయిపోగానే పది నిమిషాలలో కూతురు పడుకోడం గమనించి, తృప్తిగా లేచి, ఆకాశాన్ని చూస్తూ కూర్చుంది ఎందుకో ఎదురు చూస్తున్నట్లుగా.

* * * * *

రెండు రోజుల్లో పండగ వస్తూంది. ఎంత చెప్పినా వినకుండా రేవతి రాత్రి మూడు గంటలదాకా కుట్టి, ఇక మిగిలినవి రేపు రాత్రిలోగా కుట్టి ఇచ్చేయగలనని నిబ్బరంగా అనుకుని, అప్పుడే పడుకుంది.

ఒంటిగంట ప్రాంతంలో కొద్దిగా నిద్రపోయి లేచిన కాంతమ్మకు రేవతి మూడవుతున్నా ఇంకా కుట్టుతూండడం ఎంతో కష్టమనిపించింది. కాని, మరి వాదించి లాభంలేదు. తన పట్టుదలే తనది తప్ప ఏం చెప్పినా వినిపించుకోదు అమ్మాయి.

రేవతి బాగా నిద్రపట్టనిచ్చి లేచి, మిగిలివున్న గుడ్డలు తీసి దగ్గర పెట్టుకుని, కుట్టడానికి కూర్చుంది. కూతురు కష్టపడుతోందన్న విచారం అయితే తనకు ఎక్కువగా ఉందిగాని, తనకు మాత్రం ఈ మధ్యను కొన్ని రాత్రులుగా నిద్రవుందా? కాక శరీరంలో ఏమైనా శక్తి ఉంటేకదూ. అయినా, ఏమో తాను భయపడినంత పాడుగా లేదు. అలా కుడుతూవుంటే కొంచెం కొంచెం తొందరగా కూడా పని నడుస్తున్నట్టు కనిపించసాగింది. ఊరికే కూర్చుంటే ఊపిరి తీసుకోడం కష్టంగా ఉన్నట్టుందిగాని, ఇలా పని చేస్తూవుంటే ఏమీ లేదు. అనుకుని ఇంకా తొందరగా ఉత్సాహంగా కుట్ట సాగింది.

నాలుగు గంటల ప్రాంతంలో దగ్గు విపరీతంగా వచ్చింది. లేవాలంటే మామూలుగా లేచేట్టు లేవబడలేదు. ఎలాగో పెరటిలోకి వెళ్ళింది. మామూలు కంటె ఎక్కువ రక్తం పడింది. వెంటనే కడగటానికి కుండలో నీళ్ళు లేక పోయాయి. సరే, తెల్లవారేక కడుక్కోవచ్చని మెల్లగా ఇంట్లోకి వచ్చి ఎందుకయినా మంచిదని అమ్మాయి తెచ్చిన మందు మరొక మోతాదు త్రాగి, మళ్లీ కుట్టడానికి కూర్చుంది.

తెల తెలవారుతూ వుండగా రేవతికి మెలకువ వచ్చింది. తన మంచానికి ఎదురుగావున్న లక్ష్మీదేవి పటానికి నమస్కారించి పెరట్లో తులశమ్మకు నమస్కారం చెయ్యడానికి వెళ్లింది.

నూతి గచ్చుమీద అబ్బ, రక్తం, ఎంత రక్తం, మరక కట్టేసింది. ఎప్పటికప్పుడు కడిగేసేది. రాత్రి కడగలేకపోయింది కాబోలు. ఎంత బాధపడ్డదో? ఇన్ని తలపులూ క్షణంలో మెరిశాయి. గబగబా అమ్మా అమ్మా అనుకుంటూ గదిలోనికి వెళ్ళింది.

మంచంమీద అమ్మలేదు. ఎక్కడికి వెళ్లింది చెప్మా? ఆఁ. ఏమిటిది? క్రిందను పడుకుందెందుచేతో? పడిపోయింది కాబోలు.

"అమ్మా అమ్మా, లే, లే. క్రిందను పడుకున్నావేమిటి" అంటూ లేపబోయింది.

అసలు స్పర్శలోనే ఏదో కొత్తగా తగిలింది. కళ్లు నిద్రపోతున్నట్టుగా లేవు, మేలుకుని వున్నట్టూ లేవు. మరేమనడానికీ తోచక ముందు మంచం మీదికి తీసుకుని వెళ్ళాలని లేపబోయింది. ఎలాగో అతి కష్టంమీద నిలబెట్టి అటు కుడిచేతితట్టు వెళ్ళి నడిపిద్దామనుకుంది. ఇంతలో తన పట్టుజారి శరీరము గుల్లగావున్న కర్రవలె నేలను పడిపోయింది. అప్పటికీ రేవతికి ఇంకా జరగవలసినదేదో జరిగిపోయిందన్న నమ్మకం కలగలేదు. మంచం కొంచెం దగ్గరగా యీడ్చి, ఈమారు మరి నిలబెట్టకుండా 'అమ్మ ఎంత బరువుగనక, దూదికన్నా తేలిక' అనుకుని మెల్లగా ఎత్తి మంచంమీద పడుకోబెట్టి "అమ్మా, మరి మాట్లాడవుటమ్మా. రాత్రి నేను పడుకున్నాక నువ్వు కుట్టేవుకదూ. అందుకే ఇంతలా నిద్రపట్టింది. పోనీ పడుకో" అని కొంచెం ఎడంగా వచ్చింది.

అంతలో "మర్కొడ నిద్ర, ఇక ఒకటే పెద్ద నిద్ర. మీ అమ్మ చచ్చిపోయింది" అని ఎవరో తన చెవిలో చెప్పినట్టయింది.

"ఆఁ ఆఁ, నే న్నమ్మను. రాత్రి అంత బాగా మాట్లాడింది. అబ్బే లేదు, నిద్రే. ఈమధ్యని నాతోపాటు మేలుకొంటున్నది. అసలే జబ్బు. అందుచేత నిద్ర బాగా పట్టింది. అంతే కదమ్మా, అవు నంతేనమ్మా. లేవవూ? లేవవూ? నా కేమిటో భయంగా వుంది. లేవవూ? ఇదుగో ఇవాళ వాళ్లు ఆ డబ్బిస్తే రెండువందలూ పూర్తవుతుంది. ఇక్కడుండి మరి లాభంలేదు;

అక్కడికే వెళ్లాలన్నారు డాక్టరుగారు. ఎప్పటిదాకానో ఎందుకు? ఇవాళే వెళ్దాము. అమ్మా, అమ్మా లేవవూ? అయితే మరి మాట్లాడవూ? ఇంతేనా? ఉండు మరయితే, నేనూ నీలాగే పడుకొని నీ దగ్గరకే వస్తాను. ఇదుగో పడుకొన్నానా, ఇంక వచ్చేస్తున్నానా. ఇప్పుడే, ఏమీ ఆలస్యంలేదు."

* * * *

ఆ సాయంత్రం వీరాస్వామి ఇంటికి వచ్చి, తలుపు పిలిచి పిలిచి విసిగి, గట్టిగా కాలితో తంతే అదివరకే సగం ఊడిపోతున్న గడియ పూర్తిగా ఊడిపోయి తలుపు తెరుచుకుంది. 'ఏం చచ్చేరా? ఎంత పిలిచినా పలకరు' అంటూ లోపలికి ప్రవేశించిన అతనికి ఎదురుగా కనబడినదృశ్యంతో కళ్లుచీకట్లుకమ్మేయి. ఎలాగో వెళ్ళి మంచందగ్గర మోకరిలబడ్డాడు. ముట్టుకుని చూసేడు. అంతే. అయిపోయింది. మరి ఏ అనుమానమూ లేదు. లేవలేకపోతే వస్తానే అటువంటి నీచమయిన తిట్లు తననోటం ఎందుకు వస్తుంది? అయినా ఇద్దరూ ఒక్కమారెలాగో? ఏమో ఏదయినా విషం పుచ్చేసుకొన్నారేమో. తను పెట్టే బాధలు భరించలేక ఏదో నిశ్చయం చేసుకొన్నవాడులా లేచి, పెరటిలోనికి వెళ్ళి నూతిదగ్గర రక్తంమరకలు చూసి, పాపం! ఎంత బాధ పడిందో కదా, సరే ఇక నేనూ ఉండనుకదా. ఈ వెధవ ఈత రాబట్టేదా ఇప్పుడీ తాడు విప్పుకొని ఇంతపని చెయ్యావలసివస్తున్న దనుకుని, కోపంగా బాల్చి నూతిలో పడేసి గబగబ గదిలోకి వెళ్ళాడు.

అంతా సిద్ధమయి ఇంక క్షణంలో బుర్ర దూర్చేస్తాడనగా "అమ్మా, అమ్మా, వస్తున్నా. ఇదిగో, ఈ వెధవ కైలింజను ఇంకా రాకుండా ఉంది" అని కేకపెట్టింది రేవతి.

ఆ కేకతో వీరాస్వామి ప్రయత్నం పటాపంచలయిపోయింది. గబగబా ముడివిప్పి, తాడు ఇంకా దగ్గరలో కనిపిస్తూఉంటే మళ్ళీ ఏం దుర్బుద్ధి పుడుతుందో అని, తీసుకెళ్ళి నూతిలో పారేసివచ్చి, నేనెంత తెలివితక్కువ వెధవని, నా బంగారుతల్లి ఇంకా బతికి ఉండదానే నేను కానుకోలేకపోయాను. నా తల్లికి అమ్మా నాన్నా లేకుండా చేస్తానా? ఇక నే లోటయినా రానిస్తానా?" అని లేపే ప్రయత్నంచేసేడు. ఏమీ ఫలితం లేకపోయింది. కాని, ఊపిరిబాగానే తీస్తున్నది. ఒళ్ళు మామూలుగానే ఉంది. మరేం భయంలేదు. గాఢనిద్ర అనుకుని, ఎత్తి మంచంమీద పడుకోబెట్టేడు.

తరవాత లేచి వెళ్ళి ఎవరినయినా పిలుద్దామనుకున్నాడు గాని, ఈరకం జబ్బులో ఎవరూ రాకపోవచ్చును. కాక వచ్చినా ఉదయంలోపుని తీసు కుని వెళ్ళేది లేదుకదా అని అలా ఒక్కడూ నేలను మఠంవేసుకుని తపస్సు చేస్తున్నట్టుగా కూర్చున్నాడు.

అదివరకు అతను మళ్ళీ తాను దారిలో పడాలనుకుని చేసుకొన్న నిశ్చయాలు ఎప్పటికప్పుడే నీటిమీద రాతలాగ అంతరించిపోతూ ఉండేవి. కాని ఆనాడు, కంటిమీద రెప్ప వాల్చకుండా రాత్రంతా కూర్చున్న దీక్షతో అతని నిశ్చయాలు హృదయంమీద శిలాక్షరాల లాగ అతుకుకొన్నాయి. వీరస్వామి మళ్ళీ మొదటిరోజుల వీరస్వామి అయిపోయేడు.

"బాబూ డాక్టరు గారూ, నా బుద్ధితక్కువల్లయితే నేమి, దాని అదృష్టం లేక పోతేనేం అది పోయింది. ఇక నాకూతురు కుండే, ఇదే నా ప్రాణం. ప్రాణం ఏమిటి, అంతకంటే ఎక్కువది. నా పీకకోసి ఇచ్చేయమన్నా ఇచ్చే స్తాను. ఎంత ఖర్చయినా మీరు చూడకండి. ఎలాగోలాగ సంపాదిస్తాను. మీరు మాత్రం దీన్ని మామూలు మనిషిని చెయ్యాలి" అన్నాడు వీరస్వామి.

"నువ్వింతలా చెప్పాలిటోయి. నీ భార్య దురదృష్టవంతురాలు. ఒక విధంగా అదృష్టవంతురాలుకూడా. ఆ జబ్బు వచ్చేక ఎక్కువకాలం యాతన పడేకంటే, వేగం పోవడమే మంచిది. కాని, ఈ పిల్ల అంటేనే నాకు ఎంతో విచారంగా ఉంది. పాపం, అప్పుడు మందుకు వచ్చినప్పుడల్లా, 'డాక్టరు గారూ! ఒక్క రెండువందలయితే చాలును కదండీ మా అమ్మ జబ్బు నయం కావడానికి' అంటూ ఉండేది. అంత తెలివయిన పిల్ల ఓపికా, పట్టుదలా, చాక చక్యం ఉన్న పిల్ల ఇలా ఐపోయిందంటే...అందులోనూ నువ్వు మళ్ళీ నీ మొదటి పద్ధతికి వచ్చి, ఊళ్ళో పేరూ డబ్బూ తెచ్చుకొంటూ ఉంటే..."

"ఏమిటో బాబూ, ఆవేళ సాయంత్రం నేనూ ఐపోవలసినవాణ్ణే. అంతా ఉరికి సిద్ధం చేసుకొన్నాను. అసలిదీ చచ్చిపోయిందనే నా లెక్క. అంతలో ఇప్పటిలాగే 'అమ్మా, అమ్మా, వస్తున్నా' అని కేక పెట్టింది. అందువల్ల నేను బతికినా, అది ఇలా అయిపోయింది."

"ఇది చిత్రంగానే ఉంది. మామూలుగా కొందరికి నిద్రలోనే లేవడం, మాట్లాడ్డం, పని పాటలు చేసుకోడం, తరవాత ఇవన్నీ జ్ఞాపకంలేక పోవడం అన్నది ఉందిగాని, ఇలాగ ఆ మునుపటిపిల్ల కానేకాదన్నట్టుగా స్తబ్దుగా

ఉండడం, ఉండుండి అంతా ఒక నాటకంలాగా చెయ్యడమూను. ఆవేళ బహుశః వాళ్ళమ్మ తను నిద్రపోయి ఉండగా కిందపడి చచ్చిపోయి ఉంటుంది ఆ లేపడమూ తనే, లేవడమూ తనే, దబ్బుమని నేల పడిపోవడం, మళ్ళీ ఎలాగో తీసుకొని వెళ్ళి మంచంమీద పడుకోబెట్టడం, తను ఇంకా బ్రతికే ఉందనుకొని అప్పుడన్న టువంటి మాటలన్నీ అనడం. ఇదంతా మళ్ళీ తరవాత ఏమీ జ్ఞాపకం ఉండదుకదూ ?"

"జ్ఞాపకం ఏమిటి బాబూ, అసలు మతి, ఆలోచన అన్నవే ఉన్నట్టనిపించదు. ఒకొకమాటు ఇదంతా నడిచిన పనులమూలంగా చేస్తుంది. మరొకప్పుడు తనలో తనే ప్రశ్న, జవాబు—అలా గంటలకొద్దీ మాట్లాడుకొంటూ కూర్చుంటుంది. ఉండుండి 'అమ్మా, రమ్మంటున్నావు కదూ. ఇదిగో రైలు పట్టాలు, అదిగో రైలు వస్తూన్నది. అబ్బ మధ్యలో ఎందు కాగిందో ? అదుగో అని పళ్ళు బిగకరుచుకొని ఉండిపోతుంది. మరి ఇది కుదరదా బాబూ ?"

"ఏమిటో, ఏమీ చెప్పలేకుండా ఉన్నాను. కాని ఒక్కటి, ఆ మన లోకజ్ఞానం వచ్చిన సమయంలో నయినా ఇంతకంటే కొంత నయంగా ఉంటున్నదా ?"

"అప్పుడూ ఇంతే బాబూ. ఉండుండి, 'అమ్మా' అని పిలిచి, తను ఆరేళ్ళ పిల్లలాగు, 'అమ్మా, అమ్మ ఉండేదే, నాకు బడికి వెళ్ళడానికి అన్నం పెట్టి గౌను తొడిగేది. ఏమయివుంటుంది? చచ్చిపోయిం దంటుంది అత్తయ్యా! (అంటే మా పెద్దక్కాలెంపి). ఏమో, నిజమే కాబోలు. ఎందుకు చచ్చిపోయిందో ? నాన్న కొట్టేసేడు కాబోలు' అంటుంది బాబూ. దాని చిన్నతనంలో ఒక్కమాటు ఎందుకో కోపంవచ్చి వాళ్ళమ్మను కొట్టేను. అదీని, మా మేనమామకొడుకు కొకడు పరీక్ష పోయిందని రైలుకింద పడి చచ్చిపోయేడని దాని ఆరోఏట ఉత్తరం వచ్చింది. బాబూ! అప్పటినుండి రైలుపట్టాలన్నా, రైలు ఇంజను కూతలన్నా కొన్నాళ్లు భయపడేది. ఆ రెండూ చిన్నప్పుడే మరిచిపోయినవి ఇప్పుడు జ్ఞాపకం వచ్చేయి. తక్కినవన్నీ మాత్రం మరిచిపోయింది. రోజుకొక మూడు నాలుగు మార్లేనా ఈఫిట్లు వస్తాయి బాబూ."

"అయినా అప్పటికంటే కొంత తగ్గినట్టేకదూ. మునపటంత ఉధృతం లేదుకదా. కాని, ఆ మరుపూ అదీ ఆ జీవశక్తి ప్రభావమే. లేకపోతే ఆ

మామూలుగా కొంత ప్రపంచజ్ఞానం ఉన్న సమయంలో వాళ్లమ్మజబ్బు గురించీ, చావుగురించీ ఏమీ జ్ఞాపకం లేకపోవడం. అలాగేఉంటే ఆ దుఃఖానికీ భయానికీ ప్రసక్తే లేకపోవును. నిజంగాకూడా ఆత్మహత్య చేసుకొని ఉండును. అయితే ఇది ఇన్నాళ్ళలో కుదురుతుందని ఏమీ చెప్పలేను. ఆ యిల్లు మార్చేయడం మంచిపని చేసేవు. వీలయినంతమట్టుకు కొత్త కొత్త ప్రదేశాలనూ, మనుషులనూ చూసేలాగ చూడు. తనకు కావాలన్నా అక్కరలేదన్నా ఓ గ్రామఫోనో, రేడియోనో కొని, అది సంగీతం తరుచు వినేలా చెయ్యి. తరుచు సినిమాలూ అవీ చూపించు. అయితే అక్కడ ఈ ఫిట్లువస్తే చిక్కే గాని, అయినా ప్రయత్నించి చూడు. ఎప్పుడో మళ్లీ మామూలుగా ఉన్నప్పుడు దానంతటదే జ్ఞాపకం రావాలి. వాళ్ళమ్మ జబ్బూ, తను రాత్రింబగళ్లు బట్టలు కుట్టడం అదంతాను. అంతవరకూ......"

అని ఇంకా ఏమో డాక్టరుగారు అంటూ ఉండగా, 'అమ్మా అమ్మా, వస్తున్నా! ఇదుగో, ఇప్పుడే' అంటూ వచ్చి, ద్వారబంధం రైలుకమ్మి అయినట్లుగా అందుమీద మెడఉంచి పళ్లు బిగించి, కళ్లు మూసుకొని, బోరగిలా పడుకొని, "అదుగో వచ్చింది ఇంజను, అమ్మో!" అని పెద్ద కేకపెట్టి మెడ పక్కకు వేలవేసింది.

డాక్టరుగారు లేవదియ్యబోతే, "వద్దుబాబూ, ఉండనియ్యండి. తీస్తే 'నేనూ చచ్చిపోయేను' అని దభీమని నేలను పడిపోతుం" దన్నాడు పలికీ పలకని గొంతుతో వీరాస్వామి.